సాక్షి
మెదక్
బుధవారం । 2 । ఆగస్టు । 2023



మరోసారి విలీన పంచాయితీ!
హుస్నాబాద్ మున్సిపాలిటీలో పోతారం(ఎస్), పందిల్ల గ్రామ పంచాయతీలను కలపొద్దని అక్కడి ప్రజలు పార్టీలకతీతంగా ధర్నా చేస్తున్నారు. 8లో



అర్హులకు సంక్షేమ ఫలాలు 8లో
సంక్షేమ ఫలాలను సమాజంలోని అన్ని వర్గాలకు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు.



ప్రమాదకరం.. రహదారి ప్రయాణం
జిల్లాలోని జాతీయ రహదారి-44 పై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై ఎక్కడికక్కడ గుంతలు పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. 9లో

న్యూస్‌రీల్

పారిశుద్ధ్య పనులకు రూ:10 కోట్లు మంజూరు

జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా



అల్లాదుర్గంలో 59 జీకే భూములపై సర్వే చేస్తున్న డీపీఓ సాయిబాబా

అల్లాదుర్గం (మెదక్): జిల్లాకు పారుశుద్ధ్యం పనులకు రూ: 10 కోట్లు మంజూరైనట్లు జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా చెప్పారు. మంగళవారం అల్లాదుర్గంలో 58, 59 జీకేకు సంబంధించిన భూములను సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం రోజులుగా వర్షాలు అధికంగా కురియడంతో ప్రజలు, అధికారులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రతి గ్రామంలో పారుశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వీధులలో నీరు నిల్వకుండా, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తులసీరాం, ఇన్‌చార్జి ఎంపీఓ రాములు, కార్యదర్శి సవిత తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులను ఆదుకోవాలి

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగారాం



వేదికపై ఐక్యతను చాటుతున్న నాయీబ్రాహ్మణులు

మెదక్: నాయీ బ్రాహ్మణ వృత్తిదారులకు ప్రభుత్వం ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగారాం పేర్కొన్నారు. మంగళవారం మెదక్‌లో నాయీబ్రాహ్మణుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. నాయీబ్రాహ్మణుల అభివృద్ధి కోసం వారికి సంఘం భవన్ నిర్మాణానికి మెదక్ జిల్లా కేంద్రంలో స్థలాన్ని కేటాయించాలని కోరారు. దేవాలయాల్లో క్షౌ రశాల, కల్యాణకట్ట, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయిలో నాయీబ్రాహ్మణులకు ఫెడరేషన్ ఏర్పాటు చేసి రుణాలు అందించాలని కోరారు. కార్పొరేట్ సెలూన్ ద్వారా వృత్తి దోపిడీ ఆపాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, గౌరవ అధ్యక్షుడు రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: మినీ గురుకులం పాఠశాలల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేసేందుకు బోధనేతర సిబ్బంది నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కలెక్టర్ రాజర్షిషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ పట్టణంలోని జంబికుంటలోగల మినీ గురుకులంలో పీఈటీ (01) వంట మనిషి (01) కిచన్ హెల్పర్(01), కొడిపల్లిలోని మినీ గురుకుల పాఠశాలలో ఆయా, (01) కిచన్ హెల్పర్ (01) పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈ పోస్టులను పూర్తిగా తాత్కాలిక ఔట్‌సోర్సింగ్ పద్ధతిన భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు అన్ని రకాల విద్యార్హత పత్రాలతో ఈ నెల 9 వరకు సంబంధిత పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

సింగూరులో విద్యుత్ ఉత్పత్తి

మొదటి రోజు 0.3 ఎంయూల కరెంట్



సింగూరులో జలవిద్యుత్ కేంద్రం

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండటంతో జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. సోమవారం సాయంత్రం నుంచి రెండు టర్బయిన్ల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. మొదటి రోజు 2,822 క్యూసెక్కుల నీటిని వినియోగించి 0.3ఎంయూల విద్యుత్‌ను ఉత్పత్తి చేశామని జెన్‌కో ఏడీఈ పాండయ్య తెలిపారు. కాగా ప్రాజెక్టులోకి మంగళవారం 6,261 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. విద్యుత్ ఉత్పత్తికి 2,822 క్యూసెక్కులు, హైదరాబాద్ తాగునీటికి 80 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

పఠనం.. సమస్యలే కఠినం

గ్రంథాలయాల్లో అరకొర వసతులు
- పరీక్షల వేళ అభ్యర్థుల తాకిడి
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- జిల్లా వ్యాప్తంగా నలుగురే లైబ్రేరియన్లు
- పేరుకుపోతున్న సెస్సు బకాయిలు

'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో.. కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో..'అన్నారు కందుకూరి. ఇలాంటి సూక్తులెన్నో పుస్తకాల ప్రాముఖ్యాన్ని, ప్రాశస్త్యాన్ని వివరిస్తున్నాయి. ఎంతో విలువైన పుస్తకాలకు నిలయమైన గ్రంథాలయలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రంథాలయ వారోత్సవాల సమయాల్లో హడావుడి చేసే పాలకులు ఆ తరువాత విస్మరిస్తున్నారు. అసలే వివిధ ఉద్యోగాల కోసం నోటిఫికేషన్లు జారీ అయిన వేళ.. అభ్యర్థుల తాకిడి పెరుగుతోంది. అరకొర వసతుల మధ్యే చదువులు కొనసాగించాల్సి వస్తోంది.



లైబ్రరీలో చదువుకుంటున్న అభ్యర్థులు

మెదక్: ప్రభుత్వం వరుసగా ఉద్యోగనోటిఫికేషన్లు వేయడంతో గ్రంథాలయాలకు అభ్యర్థులు అధిక సంఖ్యలో వస్తున్నారు. ఇప్పటికే ఎస్ఐ, కానిస్టేబుళ్లు, గ్రూప్స్ పరీక్షలకు నోటిఫికేషన్లు వెలువడిన విషయం విదితమే. ఈనెల 29న గ్రూప్ -2, సెప్టెంబర్‌లో టెట్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందుకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులు గ్రంథాలయాలను ఆశ్రయిస్తున్నారు. వసతులు అంతంత మాత్రంగానే ఉండటంతో ఇబ్బందులకు గురవుతున్నారు. కూర్చుని చదివేందుకు సైతం కుర్చీలు, టేబుళ్లు లేవు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయానికి అభ్యర్థుల పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ముందుగా వచ్చిన అభ్యర్థులకు మాత్రమే సీట్లు దొరికే పరిస్థితి నెలకొంది. మిగతావారు ఎక్కడ పడితే అక్కడ నిలబడి చదవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

సమస్యలు ఇవీ..
- మెదక్‌లో 16 లైబ్రరీలతో పాటు రెండు గ్రామీణ గ్రంథాలయాలు ఉన్నాయి. జిల్లా గ్రంథాలయం రోజుకు 12 గంటల పాటు తెరిచి ఉంటుంది. ఇందులో ఇద్దరు లైబ్రేరియన్లు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేరు. డిప్యుటేషన్‌పై లైబ్రేరియన్ విధులు నిర్వహిస్తున్నారు.
- జిల్లా గ్రంథాలయానికి నిత్యం 200కుపైగా అభ్యర్థులు వివిధ ప్రాంతాల నుంచి వస్తుంటారు. కూర్చోవడానికి స్థలం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు.
- నూతన గ్రంథాలయ భవనం మంజూరు కాగా ప్రస్తుతం అది నిర్మాణంలో ఉంది.
- జిల్లా వ్యాప్తంగా 16 గ్రంథాలయాలకు 17 మంది లైబ్రేరియన్లు ఉండాలి. కానీ నలుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మరో నలుగురు ఔట్‌సోర్సింగ్‌పై పనిచేస్తున్నారు.

పేరుకు పోయిన సెస్సు
గ్రంథాలయాల్లో కనీస మౌలికవసతులు లేక పోవటం ఆందోళన కలిగిస్తోంది. వీటి ఏర్పాటుకు గ్రంథాలయ సెస్సు (పన్ను)పై ఆధారపడాల్సి వస్తోంది. జిల్లాలో బకాయిలు 1.61 కోట్ల వరకు ఉండటంతో ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. ఎక్కువ మున్సిపాలిటీలు బకాయిలు పడటం గమనార్హం.

ప్రత్యేకంగా 8 శాతం...
గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు పరిధిలో ఉన్న గృహ సముదాయాలు, వ్యాపార సంస్థలు చెల్లించే పన్నుల్లో ప్రత్యేకంగా 8శాతం గ్రంథాలయాలకు సెస్సు, వసూలు చేస్తారు. ఈ మొత్తాన్ని ఆయా సంస్థలవారు. తిరిగి గ్రంథాలయ సంస్థలకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తంతోనే గ్రంథాలయాల్లో వసతులు కల్పిస్తారు. తాత్కాలిక సిబ్బందికి వేతనాలు చెల్లిస్తారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో నూతన గ్రంథాలయాన్ని రూ. 2.50 కోట్లుతో నిర్మిస్తుండగా ఇప్పటి వరకు రూ. 1.75 కోట్లు వెచ్చించారు. ఆ డబ్బు మొత్తం సెస్సు రూపంలో వసూళ్లు చేసినవే. రెండు మాసాలుగా మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి వివిధ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు రెండు పూటలా భోజన వసతి కల్పిస్తున్నారు.

అభ్యర్థుల తాకిడి పెరుగుతోంది



జిల్లా కేంద్ర లైబ్రరీకి అభ్యర్థులు అధిక సంఖ్యలో వస్తున్నారు. నిత్యం 150-200 మంది వరకు వస్తున్నారు. ప్రస్తుతం ఉన్న భవనంలోనే పఠనం కొనసాగిస్తున్నారు. నూతన భవనం నిర్మాణంలో ఉంది. కావాల్సిన బుక్స్ సైతం అందుబాటులో ఉంచాం. వారు కోరిన బుక్స్ తెస్తున్నాం.
– శంకర్, ఇన్‌చార్జి లైబ్రేరియన్ మెదక్



టమోత @ రూ.200

మెదక్ : రోజురోజుకు టమాట ధర దడపుట్టిస్తోంది. ఏకంగా రూ.200 ధర పలుకుతుండటంతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. నిన్న మొన్నటి వరకు కిలో ధర రూ.150 పలుకగా.. ప్రస్తుతం ఏకంగా డబుల్ సెంచరీకి చేరింది. మెదక్ జిల్లాలో గత వేసవిలో అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదు కావటంతో జిల్లావ్యాప్తంగా వెయ్యి ఎకరాల్లో టమాటా పంట పూత రాలి దెబ్బతిందని, దీంతో కొరత ఏర్పడిందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో 500 ఎకరాల్లో టమాట సాగైంది. ఈ పంట సెప్టెంబర్‌లో మార్కెట్లోకి రానుంది. అప్పుడు కిలో రూ.50లోపే ఉండనుందని వారు అంచనా వేస్తున్నారు. పలు రాష్ట్రాల నుంచి వ్యాపారులు సైతం టమాటాను దిగుమతి చేసుకుంటారని, అప్పుడు ధర తగ్గనుందని, అప్పటి వరకు అదే రేటు పలకనుందని చెబుతున్నారు. కాగా, బహిరంగ మార్కెట్లో టమాటాకు ఉన్న గిరాకీ ఆధారంగా కొందరు వ్యాపారులు సిండి కేట్ అయ్యారు. టమాటా రైతుల నుంచి కిలో రూ. 140–150 కొని, వ్యాపారులు రూ.200 చొప్పున విక్రయిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

ఘనంగా పల్లకి సేవ

పాపన్నపేట(మెదక్): పౌర్ణమిని పురస్కరించుకుని ఏడుపాయల దుర్గమ్మ తల్లికి మంగళవారం పల్లకి సేవ నిర్వహించారు. ఈఓ సార శ్రీనివాస్, పూజారులు శంకర శర్మ, మూల విరాట్టుకు పూజలు చేసి, ఉత్సవ విగ్రహాన్ని పల్లకిపై ఉంచారు. అనంతరం భక్తులు పల్లకీ ఎత్తుకుని, ఊరేగింపుగా గోకుల్ షెడ్డు వరకు తీసుకెళ్లారు.



దుర్గమ్మ పల్లకీ సేవ

మహిళా సాధికారత సాధించాలి

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్

పాపన్నపేట (మెదక్): ప్రభుత్వ ప్రోత్సాహకాలతో మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (పీడీ) శ్రీనివాస్ కోరారు. మంగళవారం పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లి, ఆరెపల్లి, మిన్‌పూర్, చీకోడ్, కొత్తలింగాయపల్లి గ్రామాల్లో రూర్బన్ రెండో విడత కింద ఏర్పాటు చేసిన ఉత్పాదక కేంద్రాలను పరిశీలించారు. వీటిని త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మండల సమాఖ్య కేంద్రంలో ఏర్పాటు చేయనున్న వ్యవసాయ అద్దె పరికరాల ఏర్పాట్లను పరిశీలించారు.



ఆరెపల్లిలో గ్లాసుల తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాస్

రూర్బన్ కింద మంజూరైన వ్యవసాయ పరికరాలను రైతులకు అద్దెకిచ్చి,వాటిని వినియోగించుకునేటట్లు చూడాలని కోరారు. ఆయన వెంట డీపీఎం మోహన్ ,ఏపీఎం సాయిలు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సమాయత్తం

- కలెక్టర్ రాజర్షిషా
- సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలి: ఎస్పీ ప్రియదర్శిని

మెదక్ కలెక్టరేట్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు, డీఆర్ఓ పద్మశ్రీలతో కలిసి పంచాయతీరాజ్, పోలీస్, రెవెన్యూ అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పోలింగ్ 576 కేంద్రాలు ఉన్నాయని, 10 నుంచి 12 పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టార్ అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. పట్టణాలలో 1500 ఓటర్లు, గ్రామీణ ప్రాంతాలలో 1,400 కన్నా ఎక్కువ ఓటర్లు ఉంటే కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపిస్తామని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బీఎల్ఓలు, బీఎల్ఏలు ఇంటింటి సర్వేలో ఫారమ్ 6, 7, 8, నమోదు వేగంగా చేయాలన్నారు. జిల్లాలో 18–19, 20–29 వయస్సు గల ఓటర్ల నమోదు వేగవంతం చేయాలని కోరారు. ఇతర జిల్లాలోని వివిధ కళాశాలల్లో ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థుల వివరాలు సేకరించాలని ఆదేశించారు. కళాశాల యాజమాన్యంతో సమావేశం ఏర్పాటు చేసి ఓటరు నమోదు చేయించాలని కోరారు. మండలాలలో, గ్రామాలలో ప్రత్యేక ఓటరు నమోదుకు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎస్పీ రోహిణి ప్రియదర్శిని మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి, సమస్యాత్మక ప్రాంతాలని గుర్తించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

స్వచ్ఛతే లక్ష్యంగా..

పరిశుభ్రతకు అవార్డులు అందించే స్వచ్ఛ సర్వేక్షణ్-2023 పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి మెదక్ జిల్లా మున్సిపాలిటీలు సిద్ధమవుతున్నాయి. పోటీల్లో సత్తా చాటేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛత కార్యక్రమాలను ముమ్మరంగా చేపడుతున్నారు. ర్యాంకుల పట్టికలో ప్రథమ స్థానం సాధించేందుకు కృషి చేస్తున్నారు. – సాక్షి, సిద్దిపేట

- స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో పాల్గొంటున్న ఉమ్మడి మెదక్ జిల్లాలోని 17 మున్సిపాలిటీలు
- మెరుగైన ర్యాంకింగ్ కోసం ముందుకు
- ఇప్పటికే ఆయా మున్సిపాలిటీలు డాక్యుమెంట్‌లు యాప్‌లో అప్‌లోడ్
- స్వచ్ఛత యాప్ ద్వారా పట్టణ ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్

ఫీడ్‌బ్యాక్ ఇచ్చిన మున్సిపాలిటీలు

మున్సిపాలిటీ	ఫీడ్‌బ్యాక్ ఇచ్చిన వారు
సిద్దిపేట	29,457
గజ్వేల్	7,773
హుస్నాబాద్	6,611
దుబ్బాక	4,885
చేర్యాల	1,779
సంగారెడ్డి	3,137
సదాశివపేట	1,504
జహీరాబాద్	5,154
ఆందోల్-జోగిపేట్	1,103
నారాయణఖేడ్	1,189
అమీన్‌పూర్	4,079
తెల్లాపూర్	618
బొల్లారం	315
మెదక్	1,554
నర్సాపూర్	1,336
తూప్రాన్	794
రామాయంపేట్	812

దేశవ్యాప్తంగా నగరాలు, పట్టణాలకు మధ్య నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్- 2023 పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లాలోని మున్సిపాలిటీలు సన్నద్ధమయ్యాయి. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ, స్వచ్ఛ భారత్ మిషన్ 2.0ల సంయుక్త ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా స్వచ్ఛ సర్వేక్షణ్-2023 పేరుతో సర్వే నిర్వహించనుంది. అయితే మెరుగైన ర్యాంకింగ్ సాధించడమే లక్ష్యంగా మున్సిపాలిటీలు ముందుకు సాగుతున్నాయి. ఉమ్మడి మెదక్ 17 మున్సిపాలిటీలు సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, ఆందోల్-జోగిపేట్, నారాయణఖేడ్, అమీన్‌పూర్, తెల్లాపూర్, బొల్లారం, మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేటలు ఉత్తమ ర్యాంకింగ్ కోసం కృషి చేస్తున్నాయి.

ఉత్తమ ర్యాంక్ కోసం..
కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా నగరాలు, పట్టణాలను స్వచ్ఛమైన నివాస ప్రాంతాలుగా మార్చాలన్న లక్ష్యంతో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. 2022లో మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో సిద్దిపేట మున్సిపాలిటీ లక్ష జనాభా ఉన్న కేటగిరిలో) జాతీయ స్థాయిలో 30వ ర్యాంక్ సాధించింది. 25–50వేల మధ్య జనాభా కేటగిరిలో పరిశుభ్రమైన పట్టణంగా గజ్వేల్, 15–25వేల మధ్య జనాభా కేటగిరిలో పౌరుల అభిప్రాయాలు తీసుకున్న పట్టణంగా హుస్నాబాద్ అవార్డును సొంతం చేసుకుంది. స్వచ్ఛ సర్వేక్షణ్- 2023లో సైతం మెరుగైన ర్యాంక్‌లను సాధించాలని లక్ష్యంతో పట్టణాలను అందంగా తీర్చి దిద్దుతున్నారు. దేశవ్యాప్తంగా 4,483 నగరాలు పోటీ పడుతున్నాయి. గతంలో ఎప్పుడూ లేనివిధంగా పోటీ పెరిగింది. మున్సిపల్ అధికారులు విరామం లేకుండా ప్రజల్లో అవగాహన కల్పిస్తూ శ్రమిస్తూ ఉత్తమ స్వచ్ఛ పట్టణాల కల సాకారం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



సిద్దిపేటలోని ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో స్వచ్ఛత యాప్ గురించి అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

9,500 మార్కులు
స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొత్తం 9,500 మార్కులు కేటాయించనున్నారు. అందులో సర్వీస్ లెవల్ ప్రోగ్రెస్‌కు 4,830, సర్టిఫికేషన్‌కు 2,500, సిటీజన్ వాయిస్‌కు 2,170 కేటాయించగా, అందులో సిటీజన్ ఫీడ్ బ్యాక్‌కు 600 మార్కులను కేటాయించనున్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలు ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షణ్-2023కు ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేశారు. వాటి ప్రకారం పట్టణం ఉందా లేదా అని ఫిజికల్‌గా వెరిఫికేషన్ చేయనున్నారు. అనంతరం సర్వీస్ లెవల్ ప్రోగ్రెస్ 4,830 మార్కులకు పట్టణంను బట్టి కేటాయించనున్నారు.

విస్తృతంగా అవగాహన
పట్టణం పరిశుభ్రత విషయంలో ఏ విధంగా ఉందో అని నేరుగా స్వచ్ఛతా యాప్ ద్వారా పట్టణ ప్రజలు ఫీడ్ బ్యాక్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇందు కోసం మున్సిపాలిటీలు పట్టణాల్లో యాప్ గురించి అవగాహన కల్పిస్తున్నారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పట్టణంలో మున్సిపాలిటీ అందిస్తున్న సేవలు, పరిశుభ్రతపై తమ అభిప్రాయాలను పట్టణ వాసులు పంచుకోవాల్సి ఉంటుంది. ప్రజల ఫీడ్‌బ్యాక్‌ను 10 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. ఆగస్టు 16వ తేదీ వరకు ఫీడ్ బ్యాక్‌ను స్వీకరించనున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఎక్కువ మంది పాల్గొనే విధంగా కృషి చేస్తున్నారు.

ప్రతి ఒక్కరు ఫీడ్ బ్యాక్ ఇవ్వండి



మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో, అందరం కలిసి స్వచ్ఛ, పరిశుభ్రమైన, అందమైన సిద్దిపేటగా తీర్చి దిద్దుకుంటున్న సందర్భంగా స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో సిద్దిపేట పట్టణం పాల్గొంటుంది. ప్రతి ఒక్కరూ స్వచ్ఛత యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఫీడ్ బ్యాక్‌ను ఇవ్వండి. ఫీడ్‌బ్యాక్‌ను ఇచ్చి సిద్దిపేటను ప్రథమ స్థానంలో నిలుపుదాం.
– సంపత్ కుమార్, కమిషనర్, పురపాలక సంఘం, సిద్దిపేట

బీఆర్ఎస్ పాలనలో మెదక్ అధోగతి

డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

రామాయంపేట (మెదక్): బీఆర్ఎస్ పాలనలో మెదక్ జిల్లా పూర్తిగా వెనుకబడిపోయిందని డీసీసీ అధ్యక్షుడు కె.తిరుపతిరెడ్డి అన్నారు. ఆత్మగౌరవ యాత్రలో భాగంగా మంగళవారం రామాయంపేట మండలం ఝాన్సిలింగాపూర్, పర్వతాపూర్, కిషన్ తండాలో నిర్వహించిన ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఏ పల్లెలో చూసినా అధ్వానంగా రహదారులు కనిపిస్తున్నాయని తెలిపారు. కనీసం రహదారులు మరమ్మతు చేసుకోలేని దుస్థితిలో ఉన్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తాము ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నారు. ఏకకాలంలో రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. నిరుపేదలు ఇళ్లు నిర్మించుకోవడానికి వీలుగా ఒక్కో ఇంటికి రూ.ఐదు లక్షలు మంజూరు చేస్తామని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ మండలశాఖ అధ్యక్షుడు శ్యాంరెడ్డి, పట్టణశాఖ అధ్యక్షుడు చింతల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



ఝాన్సిలింగాపూర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

క్లుప్తంగా

తెల్లాపూర్‌లో చోరీ

రామచంద్రాపురం (పటాన్‌చెరు) : తెల్లాపూర్‌లో ఎలక్ట్రికల్‌ షాపు పైకప్పుకోసి లోపలికి ప్రవేశించి విద్యుత్‌ వైర్లు, లైట్లు, ఇతర సామగ్రి చోరీ చేశారు. ఈ షాపును బొమ్మరం చౌదరి నిర్వహిస్తున్నాడు. అతడి ఫిర్యాదు మేరకు కొల్లూర్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాగులపల్లిలో...

తూప్రాన్‌: మండలంలోని నాగులపల్లిలో గుడిసెలో ఉంటున్న కవిత ఇంట్లో మంగళవారం దొంగల పడ్డారు. బీరువాలో దాచిపెట్టిన తులం బంగారు కమ్మలు, వెండి పట్టాగొలుసులతో పాటు రూ.40 వేల నగదును దోచుకెళ్లినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

శివాలయంలో...

తూప్రాన్‌: పట్టణంలోని శివాలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు పడి అమ్మవారి మెడలోని మంగళసూత్రం, ముక్కు పుడక, వీరభద్రస్వామి వెండి మీసాలు, పూజా సామగ్రిని దోచుకెళ్లారు. ఆపై హుండీని పగలగొట్టారు. మంగళవారం ఉదయం ఆలయ పూజారి గమనించి నిర్వాహకులకు సమాచారం అందించాడు. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్‌టీం నిందితుల వేలిముద్రలు సేకరించారు.

అల్లంతోటలో..

కోహీర్‌(జహీరాబాద్‌): అల్లంతోటలో దొంగలు పడ్డారు. ఈ సంఘటన మండలములోని పర్షపల్లిలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధిత రైతు రాజు యాదవ్‌ సమాచారం ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దొంగలు అల్లం తోటలో సుమారు 3 క్వింటాళ్ల అల్లం పంట తవ్వుకొని వెళ్ళారు. ఆపై అల్లం తోటలో ఉన్న సుమారు 50 బొప్పాయి చెట్లను నరికివేశారు. సుమారు రూ. 50 వేలు వాటిల్లిందని రైతు రాజు యాదవ్‌ తెలిపారు.

లైంగిక దాడి కేసులో యువకుడికి రిమాండ్‌

చిన్నశంకరంపేట(మెదక్‌): బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ యువకుడిని చిన్నశంకరంపేట పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. తూప్రాన్‌ డీఎస్పీ యాదగిరిరెడ్డి తెలిపిన వివరాల మేరకు... మడూర్‌కు చెందిన బాలికకు మాయమాటలు చెప్పి అదే గ్రామానికి చెందిన యువకుడు దుర్గరాజ్‌ లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారించి యువకుడిపై పోక్సో యాక్ట్‌ కేసు నమోదు చేశారు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

'మా కుటుంబానికి ప్రాణహాని ఉంది'

తూప్రాన్‌: పాలివారి నుంచి మా కుటుంబానికి ప్రాణహాని ఉందని మృతుడు లక్ష్మీనారాయణ గౌడ్‌ కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజులు క్రితం మనోహరాబాద్‌ మండలం దండుపల్లి వద్ద కోనాయపల్లి(పీటీ)కి చెందిన దుర్గం లక్ష్మీనారాయణగౌడ్‌ హత్య గురైన విషయం తెలిసిందే. అతడి కుటుంబీకులు మంగళవారం తూప్రాన్‌ సీఐ కార్యాలయంలో పలువురిపై ఫిర్యాదు చేశారు. అనంతరం మృతుడు లక్ష్మీనారాయణగౌడ్‌ భార్య జయమ్మ, కుమారుడు ప్రేమ్‌దాస్‌గౌడ్‌, కూతురు శిల్పలు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోనాయపల్లిలో భూమి విషయమై పాలివారికి, తమకు పలుమార్లు గొడవలు జరిగాయన్నారు. ఇదే విషయమై లక్ష్మీనారాయణగౌడ్‌ హత్యచేసి ఉంటారన్నారు. ఈ హత్య కేసులో మరికొంతమంది ఉన్నట్లు వారు ఆరోపించారు. సీఐ స్పందిస్తూ, కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. హత్య కేసులో ఎంతమంది నిందితులు ఉన్నా వదిలిపెట్టేదీ లేదన్నారు.

రేపటి నుంచి ప్రాక్టికల్‌ పరీక్షలు

సిద్దిపేట ఎడ్యుకేషన్‌ : అంబేడ్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీ డిగ్రీ ద్వితీయ సంవత్సరం 4వ సెమిస్టర్‌ ప్రాక్టికల్‌ పరీక్షలు నెల 3 నుంచి 5 వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు స్టడీ సెంటర్‌ రీజనల్‌ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ మధుసూదన్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. విద్యార్థులు గమనించి ప్రాక్టికల్‌ పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

మరోసారి విలీన పంచాయితీ!

హుస్నాబాద్‌ మండల పరిధిలోని పోతారం(ఎస్‌), గాంధీనగర్‌, పందిల్ల గ్రామ పంచాయతీలను హుస్నాబాద్‌ మున్సిపాలిటీలో విలీనం చేయాలని ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ జూలై 26న కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. ఈ మూడు గ్రామ పంచాయతీలు విలీన తీర్మానం చేయాల్సి ఉంటుంది. ఇందులో రెండు గ్రామాలు విలీనాన్ని వ్యతిరేకిస్తున్నాయి. అందులో తాజాగా పోతారం(ఎస్‌) గ్రామ పంచాయతీని హుస్నాబాద్‌ మున్సిపాలిటీలో కలపొద్దని అక్కడి పార్టీలకతీతంగా టెంట్‌ వేసి ధర్నా చేస్తున్నారు. అలాగే పందిల్ల గ్రామ పంచాయతీని మున్సిపాలిటీలో కలపొద్దని గ్రామస్తులు కోరుతున్నారు. మిగిలిన గాంధీనగర్‌ ప్రజలు మాత్రం పంచాయతీ పరిధిలో ఉన్న కిషన్‌నగర్‌ను మాత్రమే విలీనం చేసుకుంటే అభ్యంతరం లేదని చెబుతున్నారు.



మున్సిపాలిటీలో విలీనం చేయవద్దని టెంట్‌ వేసి ధర్నా చేస్తున్న పోతారం(ఎస్‌) గ్రామస్తులు

- హుస్నాబాద్‌ మున్సిపాలిటీలో.. పోతారం(ఎస్‌), పందిల్ల, గాంధీనగర్‌ గ్రామాలు కలపడానికి ప్రతిపాదనలు
- జూలై 26న ఎమ్మెల్యే సతీశ్‌, కలెక్టర్‌కు నివేదన
- వ్యతిరేకిస్తున్న రెండు గ్రామాలు
- కిషన్‌నగర్‌ ఒక్కటే అనుకూలం
- ధర్నా చేస్తున్న పోతారం(ఎస్‌) వాసులు

హుస్నాబాద్‌ : హుస్నాబాద్‌ మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డులకుగాను 16వేలకు పైగా ఓటర్లు, 22వేలకు పైగా జనాభా ఉంది. చిన్న పట్టణమైన హుస్నాబాద్‌ను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్‌ చేసే సమయంలో శివారులోని పలు గ్రామాలను విలీనం చేస్తారని అనుకున్నారు. కానీ అది జరగలేదు. గత సర్పంచ్‌ ఎన్నికల సమయంలోనూ కొన్ని గ్రామాలను మున్సిపాలిటీలో కలుపుతారనే ప్రచారం జరిగింది. సంబంధిత గ్రామాల నాయకులు, ప్రజలు ఐదేళ్ల వరకు విలీనం చేయవద్దని ఎమ్మెల్యేకు విన్నవించారు. దీంతో ఆ ప్రక్రియ అంతటితో ఆగిపోయింది.

శరవేగంగా అభివృద్ధి

నియోజకవర్గ కేంద్రం, రెవెన్యూ డివిజన్‌గా రూపాంతరం చెందిన హుస్నాబాద్‌ రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే నాగారం, పోతారం(ఎస్‌), గాంధీనగర్‌, మాలపల్లె, పందిల్ల గ్రామాల సమీపం వరకు పట్టణం విస్తరించింది. స్థానికంగా సర్కార్‌ భూములు లేక శివారు ప్రాంతంలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తున్నారు. హుస్నాబాద్‌ పట్టణ శివారు, పోతారం(ఎస్‌) గ్రామం కలిసిపోయినట్టే ఉంటోంది. అలాగే గాంధీనగర్‌ గ్రామ పంచాయతీ పరిధిలోని కిషన్‌నగర్‌ సైతం పట్టణ శివారు వరకు విస్తరించింది. కిషన్‌ నగర్‌ భూములు మొత్తం హుస్నాబాద్‌ మున్సిపాలిటీ పరిధిలోకే వస్తాయని రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. ఇక హుస్నాబాద్‌కు, పందిల్లకు


హుస్నాబాద్‌ పట్టణ వ్యూ

మధ్య వంతెన ఉంది. వంతెన తరువాత నుంచి పందిల్ల పరిధి వస్తోంది. హుస్నాబాద్‌కు పందిల్ల పాత గ్రామం కొంత దూరమున్నా పందిల్ల స్టేజీ మాత్రం దగ్గరగా ఉండటంతో దానిని మాత్రమే హుస్నాబాద్‌ మున్సిపాలిటీలో విలీనం చేయాలని ప్రతిపాదించారు.

ఉపాధి హామీ పథకం వర్తించదు

గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే ఉపాధి హామీ పథకం వర్తిస్తోంది. మున్సిపాలిటీకి వర్తించదు. తమ గ్రామాలను మున్సిపాలిటీలో కలిపితే ఎలా బతకాలని పోతారం(ఎస్‌), గాంధీనగర్‌, పందిల్ల గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా మున్సిపాలిటీలో పేదవాడు ఇల్లు కట్టుకోలేని పరిస్థితి ఉంది. చిన్నపాటి ఇంటి నిర్మాణం అనుమతి కోసం సుమారు రూ.60వేల నుంచి లక్ష వరకు చెల్లించాల్సి ఉంటుందని అభిప్రాయ పడుతున్నారు.

కిషన్‌నగర్‌ ఒక్కటే...

గాంధీనగర్‌ పంచాయతీ పరిధిలోని కిషన్‌నగర్‌ మాత్రమే మున్సిపాలిటీలో విలీనం కానుంది. కిషన్‌నగర్‌లో 30 ఇళ్లు ఉన్నాయి. ఇందులో హుస్నాబాద్‌ శివారు పరిధిలో 20 ఇళ్లు, పోతారం(ఎస్‌) శివారులో 5, గాంధీనగర్‌ శివారులో 9 ఇళ్లు, ఒక పెట్రోల్‌ బంక్‌ వస్తోంది. కిషన్‌నగర్‌లోనే కొత్తగా ఐఓసీ (సమీకృత)భవనం తుది దశకు వచ్చింది. త్వరలోనే ఈ బిల్డింగ్‌ అందుబాటులోకి రానుంది. అలాగే ఐఓసీ బిల్డింగ్‌ పక్కనే ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాల ఉంది. అక్కడే జర్నలిస్టుల కాలనీ నిర్మాణం కొనసాగుతోంది.

సామాన్యులకు నష్టం



మా గ్రామంలో సుమారు 2వేల వరకు జనాభా ఉంది. హుస్నాబాద్‌లో విలీనం చేస్తే సామాన్యులకు కష్టం. గ్రామంలో ఉపాధి పథకానికి సంబంధించి 550 జాబ్‌ కార్డులు ఉన్నాయి. వీరందరికీ ఉపాధి లేకుండా పోతోంది. ఇంటి, నీటి పన్నులు పెరుగుతాయి. వాటిని పేదలు కట్టలేరు. సామాన్యులు ఇల్లు కట్టుకోవాలంటే వేల రూపాయలు చెల్లించాలి. గ్రామాన్ని విలీనం చేయొద్దని ఎమ్మెల్యే సతీశ్‌ కుమార్‌ను కోరాం.

– బత్తిని సాయిలు, సర్పంచ్‌, పోతారం(ఎస్‌)

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కల్హేర్‌(నారాయణఖేడ్‌): చెరువులో గుర్తుతెలియని వ్యక్తి శవమై తేలాడు. మంగళవారం నిజాంపేట మండలం బాచేపల్లి శివారులో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులె తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పలపోల కుంట చెరువులో 35 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి మృతదేహం గుర్తించారు. ఒంటిపై గోధుమ రంగు షర్టు, మెరూన్‌ కలర్‌ ప్యాంట్‌ ధరించాడు. పంచాయతీ సెక్రటరీ రమేష్‌ కల్హేర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడా? లేదా ఎవరైనా హత్య చేసి పడవేశారా? అనే కోణంలో గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని నారాయణఖేడ్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించి మార్చురీలో భద్రపరిచారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.

తుంపర సేద్యం లాభదాయకం



చిన్నకోడూరు (సిద్దిపేట): తుంపర సేద్యంతో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయొచ్చని హార్టికల్చర్‌ జిల్లా అధికారి భాస్కర్‌ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చౌడారంలో 160 స్ప్రింక్లర్‌ సెట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై తుంపర పరికరాలు అందిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తుంపర పరికరాల ద్వారా ఆరుతడి పంటలు, ఆయిల్‌ పామ్‌ సాగు చేసుకోవచ్చని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ అనిత బాలయ్య, రైతులు పాల్గొన్నారు.

షీటీమ్స్‌తో నిరంతరం నిఘా

- సిద్దిపేట పోలీస్‌ కమిషనర్‌ శ్వేత

సిద్దిపేటకమాన్‌: సిద్దిపేట జిల్లాలో షీ టీమ్స్‌తో మహిళలు, బాలికలకు భద్రత కల్పిస్తున్నామని సిద్దిపేట పోలీస్‌ కమిషనర్‌ ఎన్‌.శ్వేత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కమిషనరేట్‌ పరిధిలోపోలీసు అధికారులు, సిబ్బంది, షీ టీమ్స్‌ సిబ్బంది, భరోసా సెంటర్‌ సిబ్బంది యాంటీ హ్యూమన్‌ ట్రాఫికింగ్‌పై మహిళలు, బాలికలకు జూలైలో ప్రత్యేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించామని స్పష్టంచేశారు. జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్‌, హుస్నాబాద్‌ డివిజన్‌లవారీగా షీటీమ్స్‌ ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, మోడల్‌ స్కూల్స్‌, కళాశాలలు, బస్టాండ్‌లు, మార్కెట్‌ ప్రాంతాల్లో విద్యార్థినులకు, మహిళలకు ర్యాగింగ్‌, ఈవ్‌ టీజింగ్‌, పోక్సో, సైబర్‌ నేరాలపై అవగాహన కల్పించామన్నారు. గత నెలలో షీటీమ్స్‌ సిబ్బంది 32 హాట్‌ స్పాట్‌ల గుర్తించి 685 సార్లు సందర్శించి, 47మంది ఈవ్‌ టీజర్లను పట్టుకుని కౌన్సెలింగ్‌ ఇచ్చామన్నారు. కొందరిపై పెట్టీ కేసులు నమోదు చేశామని తెలిపారు. జిల్లాలో షీటీమ్స్‌ సిబ్బందితో నిరంతరం నిఘా పెట్టామన్నారు. మహిళలు, బాలికలు వేధింపులకు గురైతే డయల్‌ 100కు లేదా షీటీమ్స్‌ 87126 67433, పోలీస్‌ కంట్రోల్‌ రూం 8712667100 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వరద బాధితులను ఆదుకోండి

- కాంగ్రెస్‌ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పూజల హరికృష్ణ

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్‌ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పూజల హరికృష్ణ విమర్శించారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 10 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు రాష్ట్రం అతలాకుతలం అయిందని, ప్రాణనష్టంతోపాటు విపరీతంగా పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. దీంతో రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఇళ్లు కూలిపోయి, తాగునీరు దొరకని పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బందులు పడగా కేబినెట్‌ మీటింగ్‌లో మంత్రులు, సీఎం కనీసం స్పందించక పోవడం విచారకరమన్నారు. ప్రజల మేలు కన్నా రాజకీయాలే ముఖ్యం అన్నట్లుగా బీఆర్‌ఎస్‌


మాట్లాడుతున్న పూజల హరికృష్ణ

ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టి నష్టపోయిన వారికి పరిహారం అందించాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో పార్టీ మైనార్టీ సెల్‌ నాయకులు కలీమొద్దీన్‌, నాయకులు గౌటిబాబేష్‌, గోపికృష్ణ, మైపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వహాబ్‌, బండి శివకుమార్‌, బబ్లు, అజ్మత్‌ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు

- టీఎస్‌ఎఫ్‌డీసీ చైర్మన్‌ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌ : అభివృద్ధి, సంక్షేమ ఫలాలను సమాజంలోని అన్ని వర్గాలకు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్‌ఎఫ్‌డీసీ) చైర్మన్‌ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. వర్గల్‌ మండలం సింగాయిపల్లికి చెందిన కాంగ్రెస్‌ కార్యకర్తలు, నాయకులు మంగళవారం గజ్వేల్‌లోని సీఎం మినీ క్యాంపు కార్యాలయం ఆవరణలో ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ తీసుకొచ్చిన పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని చెప్పారు. అర్హులకు పథకాలను అందించడానికి ప్రభుత్వం


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రతాప్‌రెడ్డి

ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణను ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ అఖండ మెజార్టీతో మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

రైతులు తీవ్రంగా నష్టపోయారు


ఏఓకు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

- కాంగ్రెస్‌ ఓబీసీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు సూర్యవర్మ
- కలెక్టరేట్‌ ఏఓకు వినతి

సిద్దిపేటరూరల్‌: వర్షాలతో నష్టపోయిన రైతులను, ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్‌ ఓబీసీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు సూర్యవర్మ అన్నారు. మంగళవారం వర్షాలతో నష్టపోయిన రైతులను, ప్రజలను ఆదుకోవాలని తన ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ ఏఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సూర్యవర్మ మాట్లాడుతూ, వర్షాల కారణంగా జిల్లావ్యాప్తంగా మండలాల్లో పంట పొలాలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. చాలామంది నిరుపేదలకు నిలవనీడ లేకుండాపోయిందని, గుడిసెలో నివసించే పేదలకు తినడానికి తిండిలేని పరిస్థితి నెలకొందన్నారు. పప్పు , బియ్యం, నిత్యావసరాల సామగ్రి నీట ప్రవాహంలో కొట్టుకుపోయిందన్నారు. రైతులు వేసిన పంటలు కొట్టుకుపోయాయని, పత్తి పంట పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం నష్టాన్ని అంచనా వేసి ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కిసాన్‌ కాంగ్రెస్‌ రాష్ట్ర కన్వీనర్‌ నాయిని నర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు గరిపల్లి వెంకటి, డీసీసీ ప్రధాన కార్యదర్శి మున్నా, డీసీసీ ఓబీసీ సెల్‌ కార్యదర్శి సీతాబాలు, డీసీసీ సేవాదళ్‌ ప్రధాన కార్యదర్శి మోతే కుమార్‌, నాయకులు సిరాజ్‌, జిత్తు, జావేద్‌ పాల్గొన్నారు.

కారును ఢీ కొన్న కంటైనర్‌
పలువురికి గాయాలు

మనోహరాబాద్‌(తూప్రాన్‌): కారును వెనుక నుంచి కంటెనర్‌ ఢీకొట్టింది. ఈ సంఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మనోహరాబాద్‌ మండలం కాళ్లకల్‌ గ్రామశివారులో జాతీయ రహదారి–44పై మంగళవారం చోటుచేసుకుంది. సిద్దిపేట్‌ జిల్లా ములుగు మండలం బండ తిమ్మాపూర్‌ గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మాణం చేపట్టిన కోకోకోలా పరిశ్రమకు చెందిన ప్రతినిధులు కారులో మనోహరాబాద్‌ వైపు వెళ్తున్నారు. కారు కాళ్లకల్‌ శివారులోకి రాగానే బంగారమ్మ దేవాలయం వద్ద వెనుక వస్తోన్న కంటైనర్‌ ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారు బెలూన్లు తెర్చుకోవడంతో పరిశ్రమ మేనేజర్‌ కొత్త విజయ్‌కుమార్‌, కుందన్‌కుమార్‌, ఈరావతి మహేష్‌, తీగల కుమార్‌, డ్రైవర్‌ సోమ్లానాయక్‌లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. పోలీసులు, జీఎమ్మార్‌ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని కారు, కంటెనర్‌ను రోడ్డు పక్కకు జరిపారు. తర్వాత ట్రాఫిక్‌ సాఫీగా సాగింది.

ఒకే ప్రాంతంలో రెండు ప్రమాదాలు

- రావెల్లి శివారులో కారు బోల్తా
- అక్కడే మరోకారును ఢీకొన్న ప్రైవేటు బస్సు
- రెండింటికీ కుక్కలు అడ్డురావడమే కారణం


బోల్తాపడిన కారు

తూప్రాన్‌ : మండలంలోని రావెల్లి గ్రామశివారులో రెండు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. తెలిసిన వివరాల ప్రకారం.. ఓ కారు నిజామాబాద్‌ నుంచి హైదరాబాద్‌ వైపు వెళ్తోంది. 44వ జాతీయ రహదారిపై కుక్కలు అడ్డొచ్చాయి. ఈ క్రమంలో తప్పించబోయి రావెల్లి గ్రామశివారులో రహదారి కిందకు దూసుకెళ్లి కారు బోల్తా పడింది. మరో ప్రమాదంలో ... నిజామాబాద్‌ నుంచి హైదరాబాద్‌కు వస్తోన్న మరో కారుకు మరలా కుక్కలే అడ్డుగా రావడంతో డ్రైవర్‌ సడన్‌గా బ్రేకులు వేయగా, వెనుక నుంచి వస్తున్న ప్రైవేటు బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు వెనుక భాగం నుజ్జుయ్యింది. అందులో ప్రయాణిస్తున్న కుటుంబం స్వల్పంగా గాయాలతో బయటపడింది. ఈ ప్రమాదాలకు కారణం కుక్కలు అడ్డురావడమే కారణమని వాహనదారులు పేర్కొంటున్నారు.

66 మంది బాల కార్మికులకు విముక్తి
ఎస్పీ రోహిణి ప్రియదర్శిని



మెదక్‌ మున్సిపాలిటీ: ఆపరేషన్‌ ముస్కాన్‌–9 బృందం దాడులు నిర్వహించి 66 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించినట్లు ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. మంగళవారం మెదక్‌ జిల్లా పోలీస్‌ ప్రధాన కార్యాలయంలో ఆమె మాట్లాడారు. బడికి వెళ్లాల్సిన బాలలు కష్టతరమైన పనుల్లో కష్టపడటం సమాజాభివృద్ధికి ఆటంకం అన్నారు. బాలకార్మికులుగా పని చేస్తున్న పిల్లలను 66 మంది బాల బాలికలను పట్టుకున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారుల ద్వారా వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌ ఇచ్చి వారికి అప్పగించామన్నారు. 4 కేసులు నమోదు చేశామన్నారు.

కబళించిన వాటర్‌ హీటర్‌

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

చేగుంట(తూప్రాన్‌): హీటర్‌ షాక్‌ కొట్టి వ్యక్తి బలవన్మరణం చెందాడు. ఈ సంఘటన మాసాయిపేట మండలం నగ్సాన్‌పల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చింతల నరేశ్‌ (30) స్నానం కోసం వేడి చేసిన నీటిని తీసుకునేందుకు ప్రయత్నించాడు. ప్రమాదవశాత్తు కరెంటు హీటర్‌ షాక్‌ కొట్టి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే తూప్రాన్‌ ఆస్పత్రికి తరలించగా నరేశ్‌ అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య భాగ్యమ్మ, కూతురు, కొడుకు ఉన్నారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు కాలేదు.

ప్రేమ విఫలమైందని యువకుడి ఆత్మహత్య


రాకేశ్‌

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రేమ విఫలమైందని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని పోసాన్‌పల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం....మండలంలోని పోసాన్‌పల్లికి చెందిన ఎర్రబోయిన రాకేశ్‌ (23) అదే గ్రామానికి చెందిన బాలికను కొంత కాలంగా ప్రేమిస్తున్నాడు. ఇటీవల ఈ ప్రేమ విషయం బాలిక కుటుంబ సభ్యులకు తెలియడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యువకుడికి 2 రోజుల క్రితం కౌన్సెలింగ్‌ ఇచ్చారు. ప్రేమ విఫలమైందని మనస్తాపం చెందిన రాకేశ్‌ జీవితంపై విరక్తి చెంది మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

వ్యాపారం సరిగా సాగక..

సిద్దిపేటకమాన్‌: వ్యాపారం సరిగా నడవక ఆర్థిక ఇబ్బందులతో మద్యానికై బానిసైన వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటనపై సిద్దిపేట టూటౌన్‌ పరిధిలో చోటుచేసుకుంది. సిద్దిపేట టూటౌన్‌ ఎస్‌ఐ శ్రీనివాస్‌ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కేసీఆర్‌ నగర్‌లో బి.రమేశ్‌ తన భార్య ముగ్గురు పిల్లలతో నివాసం ఉంటున్నారు. అతను స్క్రాప్‌ వ్యాపారం చేసేవాడు. గతేడాది నుంచి స్క్రాప్‌ వ్యాపారం నడవక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. కాగా రోజు మద్యం తాగి వచ్చి ఇంట్లో భార్యతో గొడవపడేవాడు. సోమవారం రాత్రి కూడా మద్యం తాగి వచ్చి గొడవపడ్డాడు. తర్వాత పక్కనే ఉన్న రూంలోకి వెళ్లి ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్‌ మృతి

పటాన్‌చెరు టౌన్‌: విద్యుత్‌ షాక్‌ తగిలి గ్రామపంచాయతీ కార్మికులు మృతిచెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు స్టేషన్‌ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని చిన్న కంజర్లకు చెందిన శ్రీనివాస్‌(39) గ్రామపంచాయతీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేసుకునేవాడు. ఈ క్రమంలో మంగళవారం మూలగల్‌ వద్ద స్తంభానికి లైట్‌ రావడం లేదని చెప్పడంతో మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌ షాక్‌ తగిలి, స్తంభంపై నుంచి కింద పడి అక్కడికక్కడ మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


శ్రీనివాస్‌ మృతదేహం

వాగులో దొరకని కారు ఆచూకీ

- 5 రోజులు గడిచినా నమోదు కాని అదృశ్యం కేసు
- అంతా ఉట్టిదేనా!

నంగునూరు(సిద్దిపేట): భారీ ప్రవాహంలో కారు కొట్టుకుపోయిందనే ప్రచారంతో ఉన్నతాధికారుల ఉరుకులు, పరుగులు పెట్టడం. మరో వైపు కారు కొట్టుకపోయి ఐదు రోజు గడిచినా ఆచూకీ లభించకపోవడంతో అసలు కారు అందులో పడిందా? లేదా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని ఏ స్టేషన్‌లోనూ కారు, వ్యక్తి అదృశ్యమైనట్లు కేసు నమోదు కాకపోవడం ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది.

నంగునూరు మండలం అక్కేనపల్లి పెద్దవాగు ప్రవాహంలో 5 రోజుల కిందట కారు కొట్టుకుపోయిందనే సమాచారంతో జిల్లా పోలీస్‌ యంత్రాంగం ఉలిక్కిపడింది. సిద్దిపేట పోలీస్‌ కమిషనర్‌ శ్వేతతో పాటు సిద్దిపేట, హుస్నాబాద్‌ ఏసీపీలు, సీఐలు, ఎస్‌ఐ, సిబ్బంది గజ ఈతగాళ్ల సాయంతో అర్ధరాత్రి వరకు గాలించారు. గత శనివారం ఉదయం ఏసీపీలు సురేందర్‌రెడ్డి, సతీష్‌కుమార్‌, రెండు డివిజన్ల సీఐలు, ఎస్‌ఐలు, పోలీసులు వాగు వద్దలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మార్గంలో సీసీ పుటేజీలు పరిశీలించడంతోపాటు డ్రోన్‌ కెమెరాలు, గజ ఈతగాళ్లతో వాగు పరివాహక ప్రాంతాన్ని అణువణువునా జల్లెడ పట్టినా కారు ఆచూకీ లభించలేదు. మంగళవారం వాగు ఉధృతి చాలావరకు తగ్గినా కారు ఆనవాళ్లు ఎక్కడ కనబడకపోవడంతో అందులో వాహనం పడిందా? లేదా? అనే అనుమానాలు వ్యక్త మౌతున్నాయి.

గాలింపు చర్యలు చేపడుతున్నాం
– సిద్దిపేట రూరల్‌ సీఐ చీరాలు

అక్కేనపల్లి వాగు ప్రవాహం చాలా వరకు తగ్గింది. 5 రోజులుగా కారు కోసం గాలింపు చర్యలు చేపడుతున్నాం. జిల్లాలోని ఏ పోలీస్‌ స్టేషన్‌లోనూ ఇప్పటి వరకు అదృశ్యం కేసు నమోదు కాలేదు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

మిరుదొడ్డి(దుబ్బాక): కాలిన గాయాలతో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతెలో జరిగింది. భూంపల్లి ఎస్‌ఐ భువనేశ్వర రావు తెలిపిన కథనం ప్రకారం గ్రామానికి చెందిన గౌడుగు బాలయ్య (70) బీడీ తాగుతుండగా ప్రమాదశాత్తు అగ్గి మిరుగులు మీద పడి నిప్పంటుకుంది. గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేశారు. అప్పటికే అతనికి కాలిన గాయాలయ్యాయి. బాలయ్యను 108 ద్వారా కుటుంబ సభ్యులు సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మృతిచెందాడు. మృతుని కుమారుడు ఎల్లం ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.